# Eenadu

# ఇక అధ్యాపకుల నియామకాలు

- **ప్రవేశాలు, పనిభారం ఉన్న కోర్సుల ఆధారంగా భర్తీ**
- **విశ్వవిద్యాలయాల్లో ఖాళీలపై సర్కారు యోచన**

**ఈనాడు, హైదరాబాద్:** మూడు విశ్వవిద్యాలయాలకు తప్ప మిగతావాటికి ఉపకులపతుల నియామకం పూర్తికావడంతో, అధ్యాపక ఖాళీల భర్తీపై తెలంగాణ సర్కారు దృష్టి సారించింది.

ఉన్నత విద్యాశాఖ పరిధిలో 11 రాష్ట్ర విశ్వవిద్యాలయాలున్నాయి. వీటిల్లో శాశ్వత బోధకులు 1,249 మంది ఉంటే, ఖాళీలు 1,504 ఉన్నాయి. ఫలితంగా బోధనలో నాణ్యత కొరవడుతోంది. పరిశోధనలు, పరిశోధన పత్రాల సమర్పణలో తీవ్ర ప్రభావం పడుతోంది. ప్రతినెలా సీనియర్ ఆచార్యులు పదవీ విరమణ పొందుతుండటంతో పరిస్థితి మరింత అధ్వానంగా మారుతోంది. చివరకు ప్రతిష్ఠాత్మక 'న్యాక్' గ్రేడ్ దక్కడమూ కష్టమవుతోంది. ఈ పరిస్థితుల నుంచి బయట పడాలంటే పోస్టుల భర్తీ తప్పనిసరిగా మారింది.

**ముఖ్యమంత్రి ఆమోదానికి:** అన్నంపెట్టే (కొలువులిచ్చే) కోర్సులను ప్రవేశపెట్టాలనీ, నేటి పరిస్థితులకు తగని కోర్సులను తొలగించాలని ముఖ్యమంత్రి కేసీఆర్.. ఉపకులపతులు, అధికారులకు సూచించారు. ఈ క్రమంలో ఆయా విశ్వవిద్యాలయాలు అందిస్తున్న కోర్సులు, సీట్ల భర్తీ, కోర్సులవారీగా పనిచేస్తున్న బోధకులు, ఖాళీలు తదితర వివరాలు కోరుతూ విద్యాశాఖ ప్రత్యేకంగా రూపొందించిన దస్త్రాన్ని ఉపకులపతులకు అందజేసింది. ఆ ప్రకారం తక్షణం వివరాలివ్వాలని కోరింది. వర్సిటీ ప్రాంగణాల్లో అందిస్తున్న కోర్సుల్లో విద్యార్థులు పూర్తిస్థాయిలో చేరుతున్నా, విశ్వవిద్యాలయ పీజీ కళాశాలల్లో మాత్రం చాలాసీట్లు ఖాళీగానే ఉంటున్నాయి. ఎంబీఏ, ఎంసీఏ సీట్లు నిండటం లేదు. ఓయూలో ఎంఏ తమిళ్, కన్నడ, పర్షియన్ వంటి వాటిల్లో ఒకరిద్దరు మాత్రమే ప్రవేశాలు పొందుతున్నారు. వాటికి ప్రవేశ పరీక్ష కూడా నిర్వహించడం లేదు. జేఎన్‌టీయూహెచ్‌లోనే ఎంబీఏ, ఎంసీఏ సీట్లు పూర్తిగా నిండలేదు! ఇలాంటి వాటిని పరిగణనలోకి తీసుకుంటారు. పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్‌శర్మ, ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి ఇప్పటికే ఆమోదం తెలిపారు. త్వరలోనే ఈ దస్త్రాన్ని ముఖ్యమంత్రికి పంపేందుకు విద్యాశాఖ రంగం సిద్ధం చేస్తోంది.

■ గతంలో మాదిరిగా విశ్వవిద్యాలయాలే బోధకుల పోస్టులను భర్తీ చేసుకుంటాయి. అదే విషయాన్ని విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆచార్య ఇటీవల ఉపకులపతుల సమావేశంలో స్పష్టం చేసినట్లు తెలిసింది. సహాయ ఆచార్యుల పోస్టులకు అధికంగా దరఖాస్తులొస్తే, అభ్యర్థులందరికీ మౌఖిక పరీక్ష నిర్వహించడం ఇబ్బందిగా మారుతుంది. అలాంటి పరిస్థితి ఎదురైతే ముందుగా వడపోత పరీక్ష నిర్వహించాలని అధికారులు యోచిస్తున్నారు.

| విశ్వవిద్యాలయం | ప్రస్తుత బోధకులు | ఖాళీలు |
|---|---|---|
| ఉస్మానియా | 595 | 669 |
| కాకతీయ | 182 | 209 |
| జేఎన్‌టీయూహెచ్ | 210 | 199 |
| జేఎన్‌ఏఎఫ్‌ఏయూ | 28 | 28 |
| మహాత్మాగాంధీ | 36 | 34 |
| పాలమూరు | 11 | 63 |
| శాతవాహన | 23 | 40 |
| తెలుగు | 28 | 32 |
| ఆర్‌జీయూకేటీ | 0 | 146 |
| తెలంగాణ | 82 | 54 |
| అంబేడ్కర్ సార్వత్రిక | 54 | 30 |